సాక్షి ఒడిశా

సోమవారం । 6 । జనవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 6,89,951

బంగారం : 550 మిల్లీ గ్రాములు

వెండి : 23 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



చిలికాలో నౌకా విహారం

చిలికాలో ఆధునిక నౌక విహరిస్తోంది. కొత్త సంవత్సర కానుకగా దీన్ని ప్రవేశపెట్టారు.

- 8లో



ఉత్సాహంగా పథోత్సవం

రాజధానిలో పథోత్సవం ఉత్సాహంగా జరిగింది. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్


ఇంద్రావతిలో కారు బోల్తా



నబరంగ్‌పూర్ సమీపంలో ఇంద్రావతి నదిలో పడిపోయిన కారు

కొరాపుట్: కొరాపుట్–నబరంగ్‌పూర్ జిల్లాలను విడదీస్తున్న ఇంద్రావతి నది వంతెనపై నుంచి ఆదివారం ఓ కారు పడిపోయింది. వంతెన రైలింగ్‌ని ఢీ కొని ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సేనాపతి వీధికి చెందిన వరుణ్ నాయక్ కుటుంబానికి చెందిన నలుగురు ప్రయాణికులు ఉన్నారు. కారు పడిన చోట నీరు లేకపోవడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అగ్ని మాపక సిబ్బంది వెలికి తీసి నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

20 ఎకరాల్లో గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలను కాల్చివేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి జగిడి పదర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగవుతున్న గంజాయి వనాలపై పోలీసులు, అటవీ, అబ్కారీ శాఖ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో 20 ఎకరాల విస్తీర్ణంలోని 60 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి దగ్ధం చేశారు. గంజాయి అక్రమ రవాణా, సాగుపై ఉక్కుపాదం మోపిన జిల్లా పోలీస్ యంత్రాంగం గత కొద్ది నెలలుగా విస్తృతంగా దాడులను నిర్వహిస్తుంది.

ఏఓబీలో అబ్కారీ శాఖ దాడులు



గారబంద వద్ద శవర తలసింగి వద్ద నాటుసారా దాడుల్లో గజపతి అబ్కారీ శాఖ సిబ్బంది

పర్లాకిమిడి: జిల్లా అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు ఆదేశాల మేరకు గజపతి మొబైల్ అబ్కారీ శాఖ బృందం ఆదివారం ఉదయం ఏఓబీలో గుసాని సమితి గారబంద, శవర తలసింగి, బుర్జంగి, పెద్ద హంస, మరింగి, గోప్పిలి (ఆంధ్రప్రదేశ్) తదితర గ్రామాల్లో నాటుసారా తయారుచేస్తున్న వారిపై దాడులు జరిపి 9000 లీటర్ల ఊట, 600 లీటర్ల నాటు సారాప్యాకెట్లను స్వాధీనం చేసుకుంది. వీటి విలువ మార్కెట్‌లో సుమారు రూ.6 లక్షలు ఉంటుందని అబ్కారీశాఖ ఇన్‌స్పెక్టర్ బిభూతీ భూషణ్ ద్వారిక తెలియజేశారు. ఈ దాడుల్లో మొబైల్ ఎక్సైజు అధికారి ప్రసన్న కుమార్ పటేల్, బింగరాజ్ దమ్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల విలువ చేసే సారా ధ్వంసం



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీస్ సిబ్బంది

జయపురం: జయపురం సమితి బరిణపుట్ పంచాయతీ సమీపంలో నాలుగు సారా బట్టీలపై దాడులు చేసి రూ.2 లక్షల విలువ గల సారా ధ్వంసం చేసినట్లు జయపురం అబ్కారి అధికారి శశికాంత దత్ ఆదివారం వెల్లడించారు. ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టు అయిన వ్యక్తి జయపురం సమితి కొంగ పంచాయతీ ఖొడొవ గ్రామం రామ గౌడ అని తెలిపారు. 200 లీటర్ల సారాతోపాటు సారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన 3,600 లీటర్ల ఊటను ధ్వంసం చేశామన్నారు. ధ్వంసం చేసిన సారా విలువ రూ.2 లక్షల 20 వేలు ఉంటుందన్నారు.

కొరాపుట్ జిల్లాలో మండీల సందర్శన



మండీలో ధాన్యం పరిశీలిస్తున్న కృషకమోర్చ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర సాహు



రైతులతో చర్చిస్తున్న సాహు



జయపురం ఆర్‌ఎంసీ మండీని సందర్శించిన సాహు



అధికారులతో మాట్లాడుతున్న మహేశ్వర సాహు

జయపురం: ధాన్యం మండీల్లో అన్యాయం జరగకుండా పర్యవేక్షించాలని సీఎం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం బీజేపీ కృషక మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర సాహు జయపురం రెగ్యులేటింగ్ మార్కెట్ సొసైటీ నిర్వహిస్తున్న మండీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు మండీలకు అమ్మకానికి తీసుకు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు, అధికారులతో మాట్లాడారు. మద్దతు ధర పెంపు హామీని బీజేపీ నిలబెట్టుకుందని తెలిపారు. ప్రోత్సాహకం కూడా అందజేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమం ప్రకారం ధాన్యం కొనాలని, దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుంచి ధాన్యం సేకరించాలని కోరారు. ఆయనతో పాటు మండీ సందర్శనల్లో కృషక మోర్చ ఉపాధ్యక్షుడు బిపదభంజన దాస్, కొరాపుట్ జిల్లా సాధారణ కార్యదర్శి చంద్ర శేఖర రథ్, కృషక మోర్చ రాష్ట్ర కోఆర్డినేటర్ గోవింద చంద్ర ప్రధాన్, జయపురం మండల అధ్యక్షుడు రాధేశ్యామ్ పొరిడ, కృషక మోర్చ నేతలె సుదర్శణ బిశ్వాల్,మోహణ మఝి తదితరులు పాల్గొన్నారు.



మండీ యార్డులో బీజేపీ నేతలతో చర్చిస్తున్న సాహు

స్పందన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

రాయగడ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో హోటల్ స్వాగత్ లైన్‌లోని రామలింగేశ్వర ఆలయం ప్రాంగణంలో ఆదివారం ముగ్గుల పోటీలు జరిగాయి. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు వారి సంప్రదాయ సంక్రాంతి పండుగ నేపథ్యానికి సంబంధించిన అంశంపై నిర్వహించిన ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వర్షా టక్కర్, వందనా జోషిలు వ్యవహరించారు. మొదటి బహుమతిని చిన్నారి శైలజ, ద్వితీయ బహుమతిని ఐ.శిరీష, తృతీయ బహుమతిని బి.శిరీషలు సంపాదించుకున్నారు. అలాగే జి.ప్రవల్లిక, జ్యోస్నా పాడిలు ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. విజేతలకు స్పందన సంస్థ అధ్యక్షులు గుడ్ల గౌరిప్రసాద్, కార్యదర్శి కె.కె.ఎం పట్నాయక్, పతివాడ తులసీ దాస్‌లు బహుమతులను ప్రదానం చేశారు. ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని ఈ తరహా పోటీలను తమ సంస్థ నిర్వహిస్తుందని అన్నారు. మన భాష, సంస్కృతి, కళలను పరిరక్షించేందుకు సంస్థ విస్తృతంగా కృషి చేస్తుందని ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ప్రసాద్ చెప్పారు.

బృందావన్ ప్యాలెస్‌లో 1985 బ్యాచ్ 'బంధుమిలన్'



గజపతి ప్యాలెస్ వద్ద 1985 బ్యాచ్ బంధుమిలన్



బృందావన్ ప్యాలెస్‌లో బంధుమిలన్‌లో పాతవిద్యార్థుల సంఘం

పర్లాకిమిడి: మహారాజా బాలుర ఉన్నత పాఠశాల 1985 టెన్త్‌క్లాస్ బ్యాచ్ బంధుమిలన్ ఆదివారం పర్లాకిమిడిలో ఘనంగా జరుపుకున్నారు. తమ పాత స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకుంటూ పాఠశాల ఆవరణలో ప్రార్థన జరిపి గురువులను కలుసుకున్నారు. అనంతరం బైకులపై బృందావన ప్యాలస్‌లో తమ గత స్మృతులు, ప్రస్తుత వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న హోదాను తమ తోటివారితో పాలు పంచుకుని ఆనందంగా గడిపారు. దాదాపు 62 మంది పర్లాకిమిడి, విజయనగరం, భువనేశ్వర్, ఇతర పట్టణాల్లో స్థిరపడిన క్లాస్‌మేట్స్ కలుసుకుని బీఎల్ ప్యాలస్‌లో జరుపుకున్నట్టు శ్యామ సుందర గంతాయత్ తెలిపారు.

కిన్నెరుల హక్కులపై చైతన్య శిబిరం



మాట్లాడుతున్న న్యాయాధికారి సుమన్ జెన



పాల్గొన్న ప్రజలు

జయపురం: సమాజంలో కిన్నెరుల (నపంసకులు)హక్కులపై కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు చైతన్యం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా జయపురం సమితి గొడొపాదర్ పంచాయతీ డొమోపాడ గ్రామంలో కిన్నెరుల హక్కులపై చైతన్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచార పతి సుమన్ జెన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు కిన్నెరులకు లభించే చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. వారికి జన్మధ్రువ పత్రాలు, ప్రభుత్వం ద్వారా వారి లింగ పరిచయ పత్రాలు పొందే అధికారం కల్పించినట్టు చెప్పారు. చట్టపరంగా వారు లింగ పరివర్తన చేసుకొనే హక్కు కలిగి ఉన్నారని సుమన్ జెన వెల్లడించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిలో ఉండే హక్కు సైతం ఉందన్నారు. అధికసంఖ్యలు కిన్నెరులు పాల్గొన్నారు.

మరొక రైతు ఆత్మహత్య

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశాలో సంబల్‌పూర్ జిల్లా బైరాగిపల్లిలో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఏడాది పంటలు నష్టపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు పనుల కోసం చేసిన అప్పుల తీర్చే మార్గం లేనందున ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు వాపోయారు. మృత రైతు రత్నాకర్ భోయ్‌గా పేర్కొన్నారు. ఇటీవల కేంద్రాపడా జిల్లా ఆలి మండలం కొలొడిహ గ్రామానికి చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అకాల వానలతో పంట నష్ట పోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రైతు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. మృతుడు రైతు కైలాస్ చంద్ర ధొలొ అప్పు చేసి సుమారు 8 ఎకరాల భూమిని సాగు చేశాడు. తనకున్న 5 ఎకరాల పొలంతో పాటు 3 ఎకరాల పొలంలో కౌలు సాగు చేశాడు. ఒక్క రోజే కురిసిన వర్షాలకు భూమిలో నీరు చేరి వరి నేలవాలింది. శుక్రవారం రాత్రి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు ఫిర్యాదు చేశారు.

పేలుడు కేసు మృతులకు పరిహారం

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లా పాణికొయిలీ ప్రాంతంలో శనివారం జరిగిన కాల్పుల సంఘటనలో 2 మంది మరణించిన విషయం విదితమే. వీరి కుటుంబీకులకు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదివారం ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీని కింద ఒక్కో మృతుని కుటుంబానికి రూ. 2 లక్షలు చొప్పున మంజూరు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పేలుడు సంఘటనలో గాయపడిన బాధితులకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

హత్య కేసులో ఇద్దరు అరెస్టు



జగన్నాథ్ హత్య కేసు వివరాలు వెల్లడించిన పోలీసు అధికారి తపశ్వినీ కుహార్, నిందితులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి బి.సింగపూర్ పోలీసు స్టేషన్ నకులగుడలో కొత్త సంవత్సరం దినాన జగన్నాథ్ మఝి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు బొరిగుమ్మ సబ్‌డివిజన్ పోలీసు అధికారి తపశ్వినీ కుహార్ ఆదివారం పత్రికల వారికి వెల్లడించారు. అరెస్టయిన నిందితుల్లో ముగ్గురు మైనర్లు కాగా ఇద్దరు మేజర్లు అని వెల్లడించారు. ఆ ఇద్దరు నకులగుడ గ్రామానికి చెందిన భక్త అడారి(21) నీలకంఠ మఝి(23) లని వెల్లడించారు. ముగ్గురు మైనర్లను జేజే బోర్డ్‌లో హాజరుపరచినట్లు వెల్లడించారు. జగన్నాథ్ మఝి కొత్త సంవత్సరం దినాన వనభోజనాలకు వెళ్లి సాయంత్రం 4.30 గంటలకు తిరిగి వస్తూ గ్రామ సమీపంలో వాలీబాల్ ఆడుతున్న పిల్లల వద్దకు వెళ్లాడు. అక్కడ తగువులాడి వాలీబాల్ నెట్‌ను చింపి వేశాడు. నీలకంఠంను తిట్టాడు. ఆ తర్వాత గ్రామంలో బాలుడితో కలిసి పైన పేర్కొన్న ఇద్దరూ ఆదివారం రాత్రి పార్టీ చేసుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో అకస్మాత్తుగా అక్కడకు జగన్నాథ్ వచ్చి ఒక నీలగిరి కట్టెతో వారిపై దాడి చేశాడని పోలీసులు వెల్లడించారు. దాంతో ఆగ్రహించిన వారంతా ఏకమై జగన్నాథ్ పై దాడిచేసి కర్రలాక్కుని జగన్నాథ్‌ను తీవ్రంగా కొట్టారని, ఆ దెబ్బలకు జగన్నాథ్ సొమ్మ సిల్లి కిందపడిపోయాడని తెలిపారు. అతడిని విడిచి వారు వెళ్లిపోయారు. జగన్నాథ్ ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు వెతికారు. 2వ తేదీన కాయకూరల తోటలో జగన్నాథ్ రక్తపు మడుగులో పడి ఉండడం చూసి అతడిని హాస్పిట్ తీసుకు వెళ్లగా అతడు మరణించినట్లు డాక్టర్లు వెల్లడించినట్లు జగన్నాథ్ సోదరుడు సురేంద్ర మఝి బిసింగపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని పోలీసు అధికారి వెల్లడించారు. జగన్నాథ్ హత్య కేసులో ఆ ఐదుగురుని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి తపశ్వినీ కుహార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



గౌతమ్ మృతదేహం



ప్రమాద దృశ్యం

మల్కన్‌గిరి: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కోయిమేట్ల పంచాయతీ ఎం.పి.వి. 62 గ్రామం వద్ద శనివారం రాత్రి 11 గంటల సమయంలో జరిగింది. అతి వేగంగా వస్తున్న బైక్ అదుపు తప్పి గేదెను ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న గౌతమ్ మండాళ్ (27) ప్రాణాలు కోల్పోయాడు. గౌతమ్ మండాళ్ పోడియా సమితి ఉంద్రుకొండ పంచాయతీకి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు గౌతమ్ ది మల్కన్‌గిరి సమితి పద్మాగిరి పంచాయతీగా పోలీసులు చెప్పారు. సమాచారం అందిన వెంటనే కలిమెల పోలీసు ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

కోడిగుడ్డు @ రూ. 8



కోడిగుడ్లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో కోడిగుడ్డు ధరలు అమాంతం పెరిగాయి. బహిరంగ మార్కెట్‌లో ఒక్కగుడ్డు ధర ఎనిమిది రూపాయలు పలుకుతోంది. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లో గుడ్లు ట్రే ధర రూ. 190 నుంచి 200 రూపాయలు పలుకుతోంది. ఒడిశాకు రావాణా తక్కువగా ఉండడంతో బలిమెల, కోరుకొండ వాసులు ఆంధ్రా నుంచి గుడ్లను తెప్పించి అధిక ధరకు విక్రయిస్తున్నారు. దీంతో పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు గుడ్డును పెట్టడం కష్టంగా ఉందని నిర్వహకులు చెబుతున్నారు. ధరను తగ్గించేలా ప్రభుత్వం దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

జంతువుల చర్మాలను రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు



చర్మాలతో పట్టుబడిన నిందితులు

జయపురం: వివిధ జంతువుల చర్మాలను అక్రమంగా రవాణా చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు అడ్డుకున్నారు. సమాచారం తెలిసిన జయపురం సదర్ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని వారు ఆటోలో తీసుకువచ్చిన 80కి పైగా జంతువుల చర్మాలు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్ర తండ్రి శనివారం వెల్లడించారు. అరెస్టు అయిన వ్యక్తులు బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ కుట్రకుండ గ్రామానికి చెందిన కృష్ణదాస్ దొలాయి, చికాపూర్ పంచాయతీ సుందరజోడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అలబాన్ పంగిలుగా వెల్లడించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి వారిని విచారిస్తున్నామన్నారు. జప్తు చేసిన జంతు చర్మాలను మెజిస్ట్రేట్ సమక్షంలో వాటిని పట్టణానికి దూరంగా ఉన్న డంప్ యార్డులో కాల్చివేసినట్టు పేర్కొన్నారు. పట్టుబడిన చర్మాల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించినట్టు పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. శనివారం ఉదయం కొంతమంది వ్యక్తులు భూతనాథ్ శ్మశాన వాటిక మార్గంలో తిరుగుతున్నారు. ఆ సమయంలో ఒక ఆటో పంజియగుడ వైపు నుంచి వచ్చింది. ఆ ఆటో నుండి దుర్గంధం వస్తుండగా వారు అనుమానంతో ఆటోను అడ్డగించారు. ఆటో నుంచి దుర్వాసన వస్తున్న విషయాన్ని జయపురం సదర్ పోలీసుకు తెలియజేసారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ శిరీష మహాపాత్రో, బరిణిపుట్ పోలీసు పండి అధికారి ఏఎస్సై కామాక్ష ప్రసాద్ బిశాయిలు సిబ్బందితో వచ్చి క్రిష్ణదాస్, అలబాన్‌లను అదుపులోకి తీసుకొని ఏమిటి తరలిస్తున్నారని నిలదీశారు. వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అనుమానంతో ఆటోను పరిశీలించగా అందులో 80కి పైగా చర్మాలు ఉన్నట్లు గుర్తించారు. చర్మాలు ఎక్కడ నుంచి తీసుకొని వస్తున్నారని విచారించగా.. తాము కొనుగోలు చేసి జయపురంలోని ఓ వ్యక్తి వద్దకు తీసుకెళ్తున్నట్టు చెప్పారు. దీంతో ఆ ప్రాంతానికి జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి, జయపురం తహసీల్దార్ సవ్యసాచి జెన చేరుకొని నిందితులను విచారించారు. వెంటనే పశువైద్యాధికారిని రప్పించారు. పశువైద్యాధికారి తన సిబ్బందితో వచ్చి జంతు చర్మాలను పరీక్షించేందుకు వాటి నమూనాలను సేకరించారు. మధ్యాహ్నం మెజిస్ట్రేట్, డిప్యూటీ కలెక్టర్ రాజకిశోర్ దాస్, తహసీల్దార్ సవ్యసాచి జెన, పోలీసు అధికారి ఈశ్వర తం సమక్షంలో చర్మాలను ముక్కలుగా చేసి వాటిని మొకాపుట్ డంప్ యార్డ్‌లో తగుల బెట్టారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ మహాపాత్రో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారి వెల్లడించారు.

క్లుప్తంగా

వణికిస్తున్న చలిగాలులు

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా చలి గాలులు వణికిస్తున్నాయి. కొన్ని మారుమూల ప్రాంతాల్లో రాత్రి పూట కనీస ఉష్ణోగ్రత 5 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది.

ప్రాంతం	వాతావరణం (డిగ్రీల సెల్సియస్)
జి. ఉదయగిరి	5.0
సిమిలిగూడ	5.9
ఫుల్బాణి	8.0
దారింగ్‌బాడి	8.5
కొరాపుట్	9.4
రౌర్కెలా	9.5
ఝూర్సుగుడ	9.8
భవానీపట్న	9.8
నవరంగ్‌పూర్	9.8

బిలిమెలలో వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి బలిమెల పోలీసులు ఐఐసీ దీరాజ్ పట్నాయక్ ఆదేశాల మేరకు ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. నీలాద్రినాగార్-బలిమెల మధ్యలో డ్రంక్ అండ్ డ్రైవ్, సీటు బెల్టు పెట్టుకోని వారు, వాహనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేసి.. కొంతమందికి జరిమానా విధించారు. ఎస్‌ఐ సతధల్ మండాళ్, హబిల్దార్ శంకర్ చరణ్ దాస్ పాల్గొన్నారు.

కారు ప్రమాదం-ఇద్దరు మృతి



ప్రమాదానికి గురైన కారు

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశా సంబలపూర్ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కారు, హైవా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. కారు నుజ్జవ్వగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులు దేబేంద్ర నాయక్, మురళీధర్ ఛురియాగా గుర్తించారు. వీరివురు సంబలపూర్ ప్రాంతానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తలుగా తెలిసింది. కొంటాపాల్ పంచాయతీ సమీపంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

మూడు తులాల పుస్తెలతాడు చోరీ

మెళియాపుట్టి: పట్టపగలు మహిళమెడలో బంగారు పుస్తెలతాడు చోరీ చేసిన సంఘటన మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాల సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేట గ్రామానికి చెందిన బాడాన రమణమ్మ భర్త అప్పన్నతో కలిసి మెళియాపుట్టి మండలం కొసమాల గ్రామంలో ఉన్న కోడలి ఇంటికి ద్విచక్ర వాహనంపై బయల్దేరింది. మెళియాపుట్టి శివారులోని ఏకలవ్యపాఠశాల సమీపంలో వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి వీరికి దగ్గరగా వచ్చి రమణమ్మ మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకుని మెళియాపుట్టి వైపు పరారయ్యాడు. దీంతో బాధితులు మెళియాపుట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. పాతపట్నం వైపు చైన్‌స్నాచర్ వెళ్లి ఉండవచ్చనే అనుమానంతో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తామని చెప్పారు.



అలరించిన శాస్వత జోషి ఒడిస్సీ నృత్య ప్రదర్శన

ఉత్సాహంగా పథోత్సవం



ఉత్సాహంగా పాటలు పాడుతున్న స్వయం పాఢి, అంతరా చక్రవర్తి

భువనేశ్వర్: భువనేశ్వర్ నగరంలోని మాస్టరు క్యాంటీన్ ఛక్ కూడలి ప్రధాన రహదారి ఉత్సవ సందడితో కళకళలాడింది. ఆదివారం తెలవారుతునే ఈ ప్రాంగణం జనాలతో కిక్కిరిసి పోయింది. దీర్ఘకాలంగా మరుగున పడిన పథోత్సవం పునరుద్ధరణ రహదారికి కొత్త జీవం పోసినట్లు తలపింపజేసింది. స్థానిక నగర పాలక సంస్థ (బీఎంసీ) నిర్వహించిన పథోత్సవం వివిధ వర్గాల ప్రజల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభమైంది. వీధి ఉత్సవం మాస్టర్ క్యాంటీన్ స్క్వేర్ నుంచి రామ మందిరం కూడలి వరకు స్థానిక జన్ పథ్‌లో ఉత్సాహభరితంగా జరిగింది. ఒడిస్సీ నృత్యం, శాస్త్రీయ సంగీతం, ఆధునిక గానా బజానా, క్రీడా విన్యాసాలు, కళాత్మక ప్రదర్శనలు వంటి ఆకర్షణీయ కార్యక్రమాలతో చలి తాకిడి ధ్యాస లేకుండా గంటల తరబడి నగర వాసులు నడి రోడ్డు మీద ఆటపాటల్లో మునిగి తేలారు. జనపథ్ దారి పొడవునా సందర్శకుల్ని ఆకట్టుకునే కళాకారులు చిత్రలేఖ ప్రదర్శనలు, క్లిష్టమైన రంగవల్లికలతో రహదారులు తళుక్కుమన్నాయి.



సిజలర్స్ బృందం రాక్ డాన్స్

ఈ నెలలో ప్రారంభం కానున్న ప్రవాసీ భారతీయ దివస్ ఇతివృత్తంతో కార్యక్రమాలు రూపొందించారు.ఈ సందర్భంగా నగర మేయర్ సులోచన దాస్ మాట్లాడుతూ.. రొటీన్, మార్పులేని జీవితానికి విరామమిచ్చి, డ్యాన్స్, మ్యూజిక్, జాగింగ్, పెయింటింగ్ తదితర కార్యక్రమాల ద్వారా శరీరానికి, మనసుకు నూతనోత్తేజం కల్పించడమే పథోత్సవం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణం, నగర అభివృద్ధి, ప్రభుత్వ రంగ సంస్థల విభాగం మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్ర, న్యాయ, అబ్కారి, పనల శాఖ ముంత్రి పృథ్వి రాజ్ హరిచందన్, స్థానిక పార్లమెంటు సభ్యురాలు అపరాజిత షడంగి, స్థానిక ఏకామ్ర నియోజకవర్గం ఎమ్మెల్యే బాబు సింగ్, మేయర్ సులోచన దాస్, గృహ నిర్మాణం, నగర అభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషా పాఢి, నగర పాలక సంస్థ కమిషనర్ రాజేష్ పాటిల్, భువనేశ్వర్ అభివృద్ధి సంస్థ బీడీఏ వైస్ చైర్మన్ డాక్టర్ తిరుమల నాయక్, బీఎంసీ సలహా మండలి సభ్యులు, అధ్యక్షులు, కార్పొరేటర్లు ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు.



నగర విశిష్టత ప్రతిబింబించే అపురూప ఛాయా చిత్ర ప్రదర్శన

దక్షిణ ఒడిశా అభివృద్ధి మండలిలో గజపతి జిల్లాకు చోటు



ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల అభివృద్ధి మండలి సమావేశంలో మంత్రి నిత్యానంద గౌండ్, ఎమ్మెల్యేలు

పర్లాకిమిడి: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి దక్షిణ ఒడిషా వికాస్ పరిషత్‌ను పునరుద్ధరించారు. భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన దక్షిణ ఒడిశా వికాస్ పరిషత్ ఆవిర్భావసభలో పర్లాకిమిడి శాసనసభ్యులు రూపేష్ పాణిగ్రాహి తన అభిప్రాయాన్ని సభలో వ్యక్తం చేశారు. దక్షిణ



ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన తరగతుల అభివృద్ధి మండలి సమావేశం

ఒడిషా వికాస్ పరిషత్‌లో ఏడు జిల్లాల్లో గజపతి జిల్లాను చేర్చడం విశేషం అని అన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర గణశిక్షా, వెనుకపడిన తరగతుల మంత్రి నిత్యానంద గౌండ్, వివిధ ఎంపీలు పాల్గొని ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేశారు. దక్షిణ ఒడిశాలోని నవరంగ్‌పూర్, జయపురం, కొరాపుట్, రాయగడ, గజపతి, కంధమాల్, ఫుల్బాణీ జిల్లాలో అన్ని సమితుల్లో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగుతుల వారికి సమానమైన అభివృద్ధి జరగాలన్నారు. సమావేశంలో నవరంగ్ పూర్ ఎమ్మెల్యే వాహినీ పతి, దిగపహాండి ఎమ్మెల్యే సిద్ధాంత మహాపాత్రో, కోరాపుట్, రాయగడ ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని డీజిల్ విక్రయం

- ట్రాక్టర్ పాడైందని యజమాని ఆందోళన

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేట వద్ద భారత్ పెట్రోలియం బంకులో డీజిల్ నాణ్యతగా లేదని జలుమూరు మండలం గుండువలసకు చెందిన ట్రాక్టర్ యజమాని కూర్మారావు తెలిపారు. శనివారం తన డ్రైవర్ మూడు వేల రూపాయల డీజిల్‌ను ట్రాక్టర్‌లో వేసి పొలానికి వెళ్లగా మొరాయించిందని, మెకానిక్‌కు చూపిస్తే డీజిల్‌లో నీరు కలవడం వల్ల ఇంజిన్ సీజ్ అయిందని చెప్పాడని పేర్కొన్నారు. ఈ విషయమై బంకు సిబ్బందిని ప్రశ్నించగా ఎదురుదాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము డీజిల్ కొన్నట్లు బంకులో సీసీ కెమెరాల్లో కూడా రికార్డ్ అయ్యిందని, నాణ్యత లేని డీజిల్ విక్రయాలు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. విషయాన్ని నరసన్నపేటలో రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, న్యాయం కోసం సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని కూర్మారావు తెలిపారు. ఈ విషయమై బంకు సిబ్బంది వద్ద ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పి తప్పించుకోవడానికి ప్రయత్నించారు.



డీజిల్‌లో నీరు కలిసిందని క్యాన్‌ను చూపుతున్న కూర్మారావు, ట్రాక్టర్ డ్రైవర్

చిలికాలో నౌకా విహారం



చిలికా సరసులో పర్యాటకుల కోసం సిద్ధమైన విలాసవంతమైన నౌక



విలాసవంతమైన నౌకలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడాతో, న్యాయ శాఖ మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్

భువనేశ్వర్: రాష్ట్రంలో పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకునేందుకు పర్యటన అభివృద్ధి సంస్థ కొత్త సంవత్సర కానుక అందజేసింది. ప్రపంచ పర్యాటకుల్ని ఆకర్షణీయంగా ఆకట్టుకునేందుకు విలాసవంతమైన నౌక పర్యటన సౌకర్యం ప్రారంభించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, న్యాయ శాఖ మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్ ఈ సౌకర్యాన్ని ఆదివారం ప్రారంభించారు. తొలి విడత కింద 2 నౌకల్ని ప్రవేశ పెట్టారు. ఖుర్దా జిల్లా బరకుల్ తీరంలో 'లేక్ క్వీన్, డైమండ్ ప్రిన్సెస్' అనే పేరుతో రెండు విలాసవంతమైన నౌకలు పర్యాటకుల సేవల కోసం అంకితం చేశారు. ఈ కార్యక్రమానికి ఖుర్దా జిల్లా మేజిస్ట్రేట్, స్థానిక ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. చిలికాలో ఇలాంటి లగ్జరీ క్రూయిజ్‌లను నడపడం ద్వారా పర్యాటకులు ఒడిశాకు మరింత ఆకర్షితులవుతారని రాష్ట్ర పర్యటన శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర పర్యటన విభాగం స్వదేశ దర్శన్ పథకం కింద ఈ సౌకర్యం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. చిలికా సరసులో ప్రముఖ పర్యాటక కేంద్రాలు కాలిజై ద్వీపం, నౌలాబొనా అతిథి పక్షుల ద్వీపం సందర్శనకు విలాసవంతమైన నౌక పర్యటన మధుర జ్ఞాపకంగా పర్యాటకుల్ని ఆకట్టుకుంటుంది. భోజనం, ఎయిర్ కండిషన్ వంటి అధునాతన సౌకర్యాలు కలిగిన ఈ నౌకల్లో ఒక్కో విడతలో 40 మంది పర్యాటకులు సందర్శనకు వీలవుతుంది. ఆసియాలో అతి పెద్ద ఉప్పు నీటి సరసుగా పేరొందిన చిలికా సరసు రాష్ట్రంలో పూరీ, ఖుర్దా, గంజాం 3 జిల్లాలు విస్తరించి ఉంది. సువిశాల చిలికా సరసు ఏటా అపురూపమైన జాతీయ, అంతర్జాతీయ, స్థానిక పక్షుల ఆగమనంతో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆహ్వానం పలకడం గర్వ కారణమన్నారు.

సేవాయత్ సస్పెన్షన్

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని దేవస్థానంలో క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడిన ఆరోపణ కింద నిందిత సేవాయత్ వ్యతిరకంగా చర్యలు చేపట్టారు. దైనందిన సేవాదుల్లో పాల్గొన్న సందర్భంగా తోటి సేవాయత్‌పై అమానుషంగా చేయి చేసుకుని దాడికి పాల్పడ్డాడు. ఈ చర్యని ఖండిస్తూ బిశ్వనాథ్ ఖుంటియా అనే సేవాయత్ వ్యతిరేకంగా క్రమ శిక్షణ చర్యలు చేపట్టారు. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నిందిత సేవాయత్‌ని 3 నెలల పాటు విధుల నుంచి దూరం చేశారు. ఈ వ్యవధిలో ఎలాంటి సేవాదుల్లో చొరవ కల్పించుకోకుండా దూరం కావాలని స్పష్టంగా ఆదేశించారు. ఈ చర్యకు ముందు వివరణ కోరుతు వివాదాస్పద సేవాయత్ బిశ్వనాథ్ ఖుంటియాకు తాఖీదులు జారీ చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



లలితా మాడీని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి సింద్రీమాల పాఠశాలకు చెందిన లలితా మాడీ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీకు ఎంపికై నట్లు హెచ్ఎం సనతాన్ ప్రదాన్ తెలిపారు. ఈ నెల 10 నుంచి 14 వరకు తెలంగాణ రాష్ట్రం మోహబూబ్‌నగర్‌లో జరగనున్న పోటీల్లో లలితా మాడీ పాల్గొంటుందన్నారు. లలితా మాడీకి హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

• సమాజ సేవే లక్ష్యం



గాయకులను సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: సమాజ సేవే ప్రధాన లక్ష్యంగా గత 28 ఏళ్లుగా జయపురం స్వచ్ఛంద సంస్థ సోషల్ అసోసియేషన్(సీవా) పనిచేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపక సభ్యులు, మాజీ కార్యదర్శి ప్రతాప్ కుమార్ పటాన్ణయిక్ వెల్లడించారు. శనివారం సాయంత్రం జయనగర్ సమీన జగన్నాథ్ సాగర్ ప్రాంతంలో గల పార్క్ ప్రాంగణంలో సీవా 28 వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. సీవా అధ్యక్షుడు సుధాకర పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన ఫౌండేషన్ డే ఉత్సవంలో పట్నాయిక్ ప్రసంగిస్తూ సీవా విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో గాయకురాలు, కొరాపుటియ పాటలు, ఒడిస్సీ పాటలు శ్రావ్యంగా పాడే ప్రజ్ఞా పండ, మరో గాయకుడు సనాతర పురోహిత్, కథలు రాయటంలో నేర్పరి దార్శార్థి సమీక్ష్య పాణిగ్రాహిలను సన్మానించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మల్కన్‌గిరి: తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదివారం ఉదయం ఆయన నివాసం వద్ద జిల్లా అంగన్‌వాడీ వర్కర్లు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పుష్టి యోజన పథకంలో గర్భిణులకు, 3 ఏళ్ల చిన్నారులకు నెలకు 12 గుడ్లు ఇవ్వాలి, ఆ స్థానంలో 8 గుడ్లు ఇస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల మెనులో మార్పు చేయాలన్నారు. 2018లో గుడ్డు ధర రూ.5 ఉండేదని, నేడు రూ.8 అయిందన్నారు. ప్రభుత్వం దీనిపై సరైన ధర చెల్లించాలని కోరారు. జిల్లా అంగాన్‌వాడీ సంఘ అధ్యక్షురాలు లక్ష్మీ మాడీ, కార్యదర్శి రేవా విశ్వస్, సబితా దేవి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్దానంలో కార్గో కార్చిచ్చు!

- కార్గో ఎయిర్‌పోర్టు కోసం సుమారు 1400 ఎకరాల భూముల సేకరణ
- వ్యతిరేకిస్తున్న 18 గ్రామాల రైతులు
- నేడు పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా




ఎం.గంగువాడలో సన్నాహక ధర్నా సమావేశంలో పాల్గొన్న రైతులు

పలాస : పచ్చని ఉద్దానం ప్రాంతం పరిధిలోని తీర గ్రామాల్లో అలజడి రేగింది. ఓ పక్క అందాల తీర ప్రాంతం, మరో పక్క కోనసీమను తలపించే జీడి మామిడి, కొబ్బరి వంటి ఉద్యాన వన పంటలకు ఆవాసమైన, ఇక్కడి ప్రజల జీవనాధారమైన భూముల్లో కార్గో గ్రీన్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం గ్రామాల్లో ఎక్కడికక్కడ సభలు, సమావేశాలు నిర్వహిస్తూ, నిరసన తెలియజేస్తూ ప్రభుత్వ ప్రతిపాదనను విరమించుకోవాలని నినదిస్తున్నారు. కార్గో పోర్టు ఏర్పాటైతే పలాస నియోజకవర్గం పరిధిలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని 18 గ్రామాలకు సంబంధించిన సుమారు 1800 మందికి చెందిన 14వేల ఎకరాల భూమిని కోల్పోవాల్సి ఉంటుంది. జీవనాధారమైన భూములు పోతే, తమ గ్రామాలు అక్కడ కనుమరుగైతే తమ పిల్లల పరిస్థితి ఏంటని ఆయా గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇంత అలజడి ఆ గ్రామాల్లో ఉన్నా కనీసం ప్రభుత్వం అధికారులు స్థానికులతో సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడుతున్నారు. ఈ మేరకు గ్రామాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను కదిలిస్తున్నారు.

మండలం	గ్రామం	సేకరిస్తున్న జిరాయితీ	ప్రభుత్వ భూమి	మొత్తం (ఎకరాల్లో)
మందస	బిడిమి	673.63	254.98	928.61
మందస	బేతాళపురం	94.2	0.67	94.87
మందస	లక్ష్మీపురం	24.45	0	24.45
వజ్రపుకొత్తూరు	చీపురుపల్లి	115.12	12.45	127.57
వజ్రపుకొత్తూరు	మెట్టూరు	180.19	27.02	207.21
	మొత్తం	1089.59	295.19	1389.71

ఎవరి కోసమీ ఎయిర్‌పోర్టు?

ఉద్దానం ప్రాంత ప్రజలకు అవసరం లేని ఈ కార్గో గ్రీన్ ఎయిర్‌పోర్టు ఎవరి ప్రయోజనాల కోసమంటూ అక్కడి ప్రజలు, ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కేవలం వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు దిగుమతులు చేయడానికేనీ, ఇందులో ఈ ప్రాంత ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంతబొమ్మాళి మండలం, వజ్రపుకొత్తూరు మండలాల సరిహద్దులో నిర్మితమవుతున్న మూలపాడు పోర్టు, అలాగే భవిష్యత్తులో నెల్లూరు జిల్లా తడ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు సుమారు 935 కిలోమీటర్ల పొడవున తీరం వెంబడి 8 లేన్ల జాతీయ రోడ్లు ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సరుకు రవాణా ఎయిర్‌పోర్టును నిర్మించి కార్పొరేటు సంస్థలకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వాలు పథకాలు రచిస్తున్నాయని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రశ్నలకు ప్రభుత్వ అధికారులు సమాధానాలు చెప్పి నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది. అలా చేయకపోతే మరో కాకరాపల్లి, బీల ఉద్యమాలు రాక తప్పదని ప్రజా సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



గ్రీన్ కార్గో ఎయిర్ పోర్టు రూట్ మ్యాప్, సైట్ పరిశీలన

క్లుప్తంగా

కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు

• ఎస్పీ వకుల్ జిందల్


వకుల్ జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లాలో కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడైనా కోడిపందాలు, పేకాటలు నిర్వహించినా, బెట్టింగులకు పాల్పడినా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో ఇదే తరహాలో నేరాలకు పాల్పడి, అరెస్టయిన వ్యక్తులను స్టేషన్‌కు పిలిచి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయాలని సూచించారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం


క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం రూరల్: ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి క్రెడాయ్ ప్రాపర్టీ షో మంచి అవకాశమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులు జరగనున్న ఈ ప్రాపర్టీ షోను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రెడాయ్ సభ్యులు సుభాష్ చంద్రబోష్, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

వేపాడ: మండలంలోని ఎస్.కోట సీతారాంపురం సమీపంలో ఆదివారం సాయంత్రం వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఏడుగురు కోడి పందెంరాయుళ్లు పట్టుబడినట్లు వల్లంపూడి ఎస్సై బి.దేవి తెలిపారు. ఈ సందర్భంగా కోడి పుంజు, రూ. ఐదు వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


శ్రీదేవి మృతదేహం

వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామానికి చెందిన గోకేడ శ్రీదేవి (38) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఇందుకు సంబంధించి ఎస్సై బి. దేవి తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దేవి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ తట్టుకోలేక జనవరి ఒకటో తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి వేపాడ పీహెచ్‌సీకి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి కేజీహెచ్‌కు రిఫర్ చేయగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి దేముడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త రాము, ఇద్దరు పిల్లలున్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి


సంఘటనా స్థలంలో తిరుపతి మృతదేహం

మక్కువ: మండలంలో కన్నంపేట గ్రామం వద్ద లారీ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. కన్నంపేట గ్రామానికి చెందిన మత్స తిరుపతి (73) అదే గ్రామంలోని బీసీ కాలనీలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి హాజరై.. తిరిగి వస్తుండగా వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు రామారావు ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న పాలకొండలో మినీ జాబ్‌మేళా

పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పాలకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధికల్పనలో భాగంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదువుకుని, 18నుంచి 32 ఏళ్ల వయస్సున్న నిరుద్యోగ యువత ఈ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల యువత హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీటీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజును తీసుకుని జాబ్‌మేళాకు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 63012 75511 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పుంజుకుంటున్న కోళ్లు..


కాకి డేగ రకం పుంజు



• ప్రత్యేకంగా పందెంకోళ్ల పెంపకం • గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన వారు వచ్చి కొనుగోలు
• ఒక్కో పుంజు రూ. 20 వేల నుంచి 30 వేల వరకు పలుకుతున్న వైనం


పచ్చకాకి


కాకిజాతి కోడి పుంజు


కాకి నెమలి రకం కోడిపుంజు

సీతానగరం: సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కోడిపందాల సందడి నెలకొంటుంది. లక్షలాది రూపాయలతో పందాలు నిర్వహిస్తుంటారు. అయితే ఈ పందాల్లో పోటీపడే వివిధ జాతుల కోడిపుంజులను మన ప్రాంతంలో పెంచుతున్న విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. కాని ఇది నిజం. బొబ్బిలి, సీతానగరం ప్రాంతాల కోడిపుంజులకు ఎనలేని గిరాకీ ఉంది. సీతానగరం మండలంలోని బుడ్డిపేట, సీతానగరం, అప్పయ్యపేట గ్రామాల్లో చాలా మంది పందెం కోళ్లను పెంచుతూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వీరు పెంచిన పుంజులకు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో గొప్ప గిరాకీ ఉంది. కోళ్లకు బాదం, జీడిపప్పు, తవుడు, కోడిగుడ్లను ఆహారంగా పెడుతుంటారు. ఎటువంటి తెగుళ్లు సోకకుండా ఉండేందుకు అవసరమైన టీకాలు కూడా వేస్తుంటారు. అలాగే వ్యాయామం కోసం సువర్ణముఖీ నదిలో రెండు పూటలా ఈత కొట్టిస్తుంటామని పెంపకందారులు చెబుతున్నారు. పందెంకోళ్లను సామూహికంగా కాకుండా ఒక్కో కోడిని ఒక్కో బుట్టలో ఉంచుతామని తెలిపారు. పచ్చకాకి, కాకి, డేగ, కాకిడేగ, కాకినెమలి, పసిలింగర్ నెమలి జాతులు పెంచుతున్నామని, ఉభయ గోదావరి జిల్లాల వారు వచ్చి తమ దగ్గర ఒక్కో కోడిని రూ. 20 వేల నుంచి 30 వేల రూపాయల వరకు కొనుగోలు చేస్తుంటారని చెప్పారు.

అలవాటుగా మారింది..

మాది సన్నకారు రైతు కుటుంబం కావడంతో మొదట నుంచీ కోళ్లను పెంచుతుంటాం. అయితే పందెం కోళ్లకు గిరాకీ ఉండంతో కొన్నాళ్లుగా ప్రత్యేకంగా వాటిని పెంచుతున్నాం. చిన్న పిల్లల్లా చూసుకుంటూ పెంచితే మంచి డబ్బులు వస్తాయి. గోదావరి, కృష్ణా జిల్లాల వారు వచ్చి మా దగ్గర కోళ్లను కొనుగోలు చేస్తుంటారు. దీంతో మాకూ ఆర్థిక భరోసా లభిస్తుంది.

– కూర్మారావు, పెంపకందారు, బుడ్డిపేట

నాటు కోళ్లకు గిరాకీ...

• పెంపకానికి ముందుకు వస్తున్న గిరిజనులు


మూలగూడలో గిరిజనుడి ఇంట పెరుగుతున్న నాటుకోళ్లు


సీతంపేటలోనాటుకోళ్లు పంచుతున్న సంస్థ ప్రతినిధులు

భామిని: సంక్రాంతి పండగ నాడు ముక్క లేనిదే ముద్ద దిగదు.. నాన్‌వెజ్ ఎన్నిరకాలున్నా నాటుకోడి మాంసం ఉంటే అదో మజా.. పండగ సమీపిస్తుండడంతో నాటుకోళ్లకు గిరాకీ నెలకొంది. రెగ్యులర్ చికెన్ షాపుల్లో బ్రాయిలర్ కోళ్లతో పాటు నాటుకోళ్లు ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. అలాగే వారపు సంతల్లో అయితే నాటుకోళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏజెన్సీలో ప్రతి ఇంటా నాటుకోళ్ల పెంపకం జరుగుతుండగా.. ప్రత్యేకంగా నాటుకోళ్ల ఫారాలు కూడా వెలుస్తున్నాయి. ప్రస్తుతం నాటుకోడి (లైవ్) కిలో రూ. 300 నుంచి 500 రూపాయల మధ్య పలుకుతోంది.

పెంపకంపై ప్రోత్సాహం..

పార్వతీపురం మన్యం జిల్లాలో నాటు కోళ్ల పెంపకంపై ఐటీడీఏ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెంపకందారులను ప్రోత్సహిస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో వాస్సన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే 30 నాటు కోళ్ల ఫారాలు ఏర్పాటయ్యాయి. మరో 200 మినీ కోళ్ల షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు కూడా నాటుకోడి ఫారాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు.

ప్రోత్సహిస్తున్నాం..



నాటుకోళ్ల పెంపకంపై పెంపకందారులను ప్రోత్సహిస్తున్నాం. ఒక్కో యూనిట్‌కు రూ. 1.30 లక్షలు ఖర్చు చేస్తున్నారు. షెడ్లతో పాటు 50 కోడి పెట్టలు, 10 కోడి పుంజులు ఇస్తున్నాం. నాటుకోడి మాంసం ఆరోగ్యకరం కావడంతో పెంపకానికి ఎక్కువ మంది ముందుకు వస్తున్నారు. కోళ్లకు అవసరమైన వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

– కళ్యాణ్ పాత్రో, ప్రొగ్రాం మేనేజర్, వాస్సన్ సంస్థ, సీతంపేట

బలవర్ధక ఆహారం



నాటు కోడి మాంసం రుచితో పాటు శరీర పెరుగుదలకు చాలా అవసరం. బలవర్ధక ఆహారం కావడంతో నాటుకోడి మాంసానికి గిరాకీ నెలకొంది. ప్రస్తుతం చాలా మంది కోళ్లను పెంచుతున్నారు. అటు ఆహారానికి ఆటు ఆర్థిక అవసరాలకు కూడా ఉపయోగపడతాయి.

డాక్టర్ కె..దీపికారాణి, వైద్యాధికారి, బాలేరు పీహెచ్‌సీ

వాలీబాల్ పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్టు


జట్టు సభ్యులతో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జైపూర్ యూనివర్సిటీలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలలో పాల్గొనే జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ జట్టును యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ఆదివారం ప్రకటించారు. ఇటీవల జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన ఇంటర్ కళాశాలల పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ మేరకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన జట్టులో పి.శ్రావణి (జీఎంఆర్‌ఐటీ, రాజాం), జి.గుణ (శ్రీవిజ్ఞాన్ ఉమెన్స్ కాలేజ్), పి.గాయత్రి (అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ భోగాపురం), పి.శృతి (ఇమ్మాన్యుయేల్ ఇంజినీరింగ్ కాలేజ్), జి.హర్షిత (జీఎంఆర్‌ఐటీ), బి.మోహన్‌లతా, ఎం.సువర్ణ (జేఎన్‌టీయూ జీవీ, విజయనగరం), కె.కీర్తి (అవంతి ఇంజినీరింగ్ కాలేజీ, గరివిడి), ఎ.తన్సీరాణి (డైట్ కాలేజీ), వి.ధాత్రి (జీఎంఆర్‌ఐటీ), బి.కావ్య (విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, ఉమెన్స్), బి.సాయిసుచిత్ర (జీఎంఆర్‌ఐటీ) ఉన్నారు. ఎంపిక ప్రక్రియలో యూనివర్సిటీ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏవీ పాపారావు, డాక్టర్ జి.అప్పలనాయుడు పాల్గొన్నారు. ఎంపికైన జట్టు సభ్యులకు యూనివర్సిటీ వీసీ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు, యూనిఫారాలు, నగదు ఇచ్చి అభినందించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోండి

• ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మున్సిపల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి పండగ సందర్భంగా తమ సొంత ప్రాంతాలకు వెళ్లే సమయాల్లో తమ ఇళ్లలో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దొంగతనాల నియంత్రణకు రాష్ట్ర పోలీస్‌శాఖ ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ప్రత్యేకంగా రూపొందించిందని పేర్కొన్నారు. ఈ విధానం పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ మొబైల్ యాప్ సేవలు విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ , నెల్లిమర్ల, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్పొరేషన్, మున్సిపల్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి అందుబాటులో ఉందన్నారు. ఈ యాప్ ప్రజల ఆస్తుల రక్షణకు కవచంలా పనిచేస్తుందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు సమీప పోలీస్‌స్టేషన్‌లో తెలియజేస్తే పోలీసులు యాప్ సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తారని చెప్పారు. స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఇంటి నుంచే తమ పేరు, ఫోన్ నంబర్, లొకేషన్ వంటి ఇతర వివరాలతో పాటు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఎప్పటి నుంచి ఎప్పటివరకూ పొందాలనుకుంటున్నారో యాప్‌లో నమోదు చేసి రిక్వెస్ట్ పంపించాలని తెలిపారు. అలా రిక్వెస్ట్ పంపించిన వారి మొబైల్‌కు ఒక రిజిస్ట్రేషన్ నంబర్ వస్తుందని, ఆ నంబర్‌నే యూజర్ ఐడీగా పొందవచ్చన్నారు. రిక్వెస్ట్ పంపించిన తర్వాత సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులు సదరు ఇంటిని సందర్శించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆయా ఇళ్లపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. దొంగతనాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే సహించేది లేదు..


ఐక్యత చాటుతున్న మాల సంఘాల జేఏసీ నాయకులు


సభకు హాజరైన మాల కులస్తులు

• మాజీ ఎంపీ హర్షకుమార్

విజయనగరం ఫోర్ట్: ఎస్సీ వర్గీకరణ జోలికి వస్తే పీఎం మోదీ, సీఎం చంద్రబాబులకు పతనం తప్పదని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక గురజాడ కళాభారతిలో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనకు అన్యాయం చేసిన ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తే అడ్డుకుంటామన్నారు. ఎస్సీ వర్గీకరణకు మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లే కారణమని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం పథకాన్ని వాయిదా వేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ మాట్లాడుతూ.. 2024 ఆగస్టులో సుప్రీంకోర్టు వెలువరించిన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ గైడ్‌లైన్స్‌ను పునఃసమీక్షించాలన్నారు. కులగణన చేయకుండా ఉపకులాలుగా వర్గీకరించడం అశాస్త్రీయమని తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు బీవీ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల కృష్ణారావు, జేఏసీ నాయకులు బుంగ భానుమూర్తి, ప్రకాశరావు, సురగాల సూరప్పడు, ఎం. అప్పారావు, ఆదాడ మోహనరావు, పి. వెంకటరమణ, గంటాన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు వెళ్లి తేల్చుకో..

• రెవెన్యూ సదస్సులో ఓ వీఆర్‌ఓ సమాధానం
• లబోదిబోమంటున్న బాధితుడు


ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతు

బలిజిపేట: భూ సమస్యపై అర్జీ ఇచ్చిన ఓ రైతుకు వీఆర్‌ఓ తలతిక్క సమాధానం చెప్పడంతో బాధితుడు అవాక్కయ్యాడు. కోర్టుకు వెళ్లి భూ సమస్యను పరిష్కరించుకోవాలని ఉచిత సలహా ఇవ్వడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. బాధితుడు తెలియజేసిన వివరాల్లోకి వెళితే.. ఈ నెల నాలుగో తేదీన వంతరాం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాగుల లక్ష్మం తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన భూమిని తన పేరిట ఆన్‌లైన్ చేయాలని కోరగా.. వీఆర్‌ఓ ఎ.గోపాలకృష్ణ దురుసుగా సమాధానం చెప్పాడు. నీ సమస్య ఇక్కడ పరిష్కారం కాదని..కోర్టుకు వెళ్లిపోవాలని బదులివ్వడంతో ఏమి చేయాలో తెలియక బాధితుడు మిన్నకుండిపోయాడు. లక్ష్మంనకు వంతరాంలో సర్వే నంబర్ 71- 6లో 16 సెంట్ల భూమి ఉంది. ఈ భూమి ఇటీవల జరిగిన రీ సర్వేలో వేరే వారి పేరుమీద నమోదైంది. తన భూమి తన పేరుపై నమోదు చేయాలని కోరితే.. కోర్టుకు వెళ్లమని చెప్పడం ఎంతవరకు సమంజసమని బాధిత రైతు వాపోతున్నాడు.

చివరికి మందు బాబులనూ ముంచేశారు..

• అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య


విలేకరులతో మాట్లాడుతున్న సోరు సాంబయ్య

బొబ్బిలి: తల్లికి వందనం.. ఫీజు రీయింబర్స్‌మెంట్.. లక్షల ఉద్యోగాలు.. మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను.. అన్నదాత సుఖీభవ అంటూ రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చివరకు మందుబాబులనూ ముంచేశాడని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, సాహితీపీఠం కన్వీనర్ సోరు సాంబయ్య ఆరోపించారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విక్రయించిన బ్రాండ్లు మంచివి కావనీ, తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యాన్ని వంద రూపాయలకే ఇస్తానన్న చంద్రబాబు ఇప్పుడు మాట తప్పి బార్‌లలో విక్రయించుకునేందుకు గేట్లు బార్లా తెరిచారన్నారు. బ్రాండెడ్ మద్యం కూడా షాపుల్లో దొరకడం లేదని ఆరోపించారు. మద్యం దుకాణాల నుంచి బెల్ట్‌షాపులకు మద్యం తరలిపోతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అక్కడక్కడా సివిల్ పోలీసులు మద్యం పట్టుకుంటున్నారే తప్ప.. ఎక్సైజ్ అధికారులు ఎక్కడా దాడులు చేసిన దాఖలాలు లేవని చెప్పారు. మద్యం దుకాణాల్లో అవినీతి చేపట్టినా, అధిక ధరలకు విక్రయించినా మొదటిసారి భారీ జరిమానా, రెండోసారి షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడెక్కడున్నారని ప్రశ్నించారు. మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సిబ్బంది క్వింటాకు ఐదు కిలోలు అదనంగా తీసుకుంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టిన లారీ

• ఒకరికి తీవ్ర గాయాలు


ప్రమాదస్థలంలో స్కూటీ, లారీ

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై చినభోగిలి – సీతానగరం గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలియజేసిన వివరాల మేరకు.. గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన గడిదేసు రాంబాబు విశాఖపట్నం నుంచి స్వగ్రామానికి స్కూటీపై వస్తున్నాడు. సరిగ్గా చినభోగిలి గ్రామం దాటుతుండగా.. పార్వతీపురం నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఎస్సై ఎం. రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు..


తీవ్ర గాయాలతో పడిఉన్న దిలీప్‌కుమార్

పాచిపెంట : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పి. కోనవలస జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన బొత్స దిలీప్ కుమార్ (24) పాచిపెంట నుంచి ద్విచక్ర వాహనంపై సాలూరు వెళ్తుండగా.. పణుకువలస చైతన్య పాలిటెక్నికల్ కాలేజ్ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఐరన్ పోల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దిలీప్‌ను స్థానికులు 108 వాహనంలో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.

కళ్లికోటకు చేరుకున్న ఏనుగుల గుంపు


కళ్లికోట-కారవవలస మధ్యలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ: గడిచిన నెల రోజులుగా గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు ఆదివారం కొమరాడ మండలంలోని కళ్లికోట, గారవలస గ్రామ సమీపంలోకి చేరుకుంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కూరగాయల సాగు ఎక్కువగా ఉండడంతో చేతికివచ్చిన టమాటో, అరటి తదితర కూరగాయల పంటలతోపాటు జొన్న, కళ్లాల్లో ఉన్న ధాన్యం ధ్వంసం చేస్తాయోమోనన్న భయంతో ఉన్నారు. ఏనుగుల గుంపును తరలించడంపై అటవీశాఖాధికారులు స్పందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి కొండ ప్రాంతాల వైపు ఏనుగుల గుంపును తరలించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా రేపు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గవర్నమెంట్ ఐటీఐ కళాశా ల విజయనగరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధికల్పనలో భాగంగా ఎస్ఎస్ సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 35 సంవత్సరాల వయసులోపు ఉన్న నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాలో సేఫ్ డ్రైవ్ ప్లస్, హెటిరోడ్రగ్స్ తదితర బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులు తమ వివరాలను 'నైపుణ్యం.ఏపీ.జీటీవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకుని అడ్మిట్ కార్డుతోపాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ఆ రోజు ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రాంగణానికి హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్: 79956 91295, టోల్ ఫ్రీ: 9988853335 నంబర్లలో సంప్రదించాలని కోరారు.